క్లుప్తంగా

యోగాసనాల్లో సత్తాచాటిన 'విజ్ఞాన్' విద్యార్థులు



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు యోగాసన పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు, ప్రకాశం జిల్లాలు నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన చాంపియన్‌షిప్‌లో రిథమిక్ పెయిర్, ట్రెడిషనల్ యోగాసన, ఆర్టిస్టిక్ యోగ సోలో వంటి విభాగాల్లో పాల్గొని 13 మొదటి స్థానాలు, 5 ద్వితీయ స్థానాలు, ఒక తృతీయ స్థానం సా ధించి సర్టిఫికెట్లను పొందారని వెల్లడించారు. వీరు రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థుల్లో ఎ.ఉదయ్ కుమార్, యశ్వంత్ కుమార్, సాయి రవీష్, చైతన్య, టి.తేజస్విని, వై.గాయత్రి బాల, జి.శివరామక్రిష్ణ, కె.రాజ్‌కుమార్, ఇ.చరణ్ గణేష్ రెడ్డి, టీఎస్‌వీ సాయి పవన్, కె.సాయిక్రిష్ణ ఉన్నారు. వీరిని వైస్ చాన్సలర్ నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ అభినందించారు.

తల్లిపాలతో మానసిక ఎదుగుదల

ప్రత్తిపాడు: బిడ్డ మానసికంగా ఎదిగేందుకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం అన్నా రు. ప్రత్తిపాడులోని రామానగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కోయవారిపాలెంలో జరిగిన వారోత్సవాలలో గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ అరుణ పాల్గొన్నారు. సీహెచ్‌వో విజయ, కార్యకర్తలు జ్యోతిరాణి, రజని, జిక్కీ, ఏఎన్ఎం శ్యామల పాల్గొన్నారు.

వీఆర్‌ఏగా జెట్టి లక్ష్మీకుమారి

చేబ్రోలు: పాతరెడ్డిపాలెం గ్రామ సచివాలయం వీఆర్‌ఏగా జెట్టి లక్ష్మీకుమారికి నియామకపత్రం అందజేసినట్లు చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ సోమవారం తెలిపారు. పాతరెడ్డిపాలెం వీఆర్‌ఏగా పనిచేస్తున్న చుక్కా శ్యామల్‌జాన్ కొంతకాలం క్రితం మరణించారు. కారుణ్య నియామకం ఆమె కుమార్తె జెట్టి లక్ష్మీకుమారికి చేబ్రోలు వచ్చిన తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ సోమవారం వీఆర్‌ఏ నియామకపు పత్రం అందజేశారు.

దోమతెరలు పంపిణీ

పెదకాకాని: గ్రామ సర్పంచ్ గోళ్ళ స్వరూపరాణి అన్నారు బాజీ బాబాకాలనీలో సోమవారం ఎఫ్ ఎఫ్‌వీడీపీ, జేఎంజే సేవా సస్థ వారి ఆధ్వర్యంలో ఉచిత దోమ తెరలను ఆదివాసీలకు అందజేశారు. శ్యాంముఖర్జీబాబు, షేక్ ఆరిఫ్, ప్రోగ్రాం మేనేజర్ సుశీల, ప్రాజెక్ట్ ఆఫీసర్లు కె.ఐజాక్, డి.శ్రవంతి, పి.అనిల్, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

గుంటూరు రూరల్: పంటకోత ప్రయోగాలపై మండల వ్యవసాయాధికారులు, వీపీఏలు, ఉద్యాన సహాయకులు, విస్తరణ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నగరంలోని కృషి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు తోటకూర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రణాళిక శాఖ సహాయ సంచాలకులు హిమ ప్రభాకర్, ఏడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సాగు చేసిన పంటల వివరాలు ఖచ్చితంగా ఈ–క్రాప్‌లో నమోదు చేయాలన్నారు.

పంచాయతీల్లో మినీ సంగ్రామం

- నియోజకవర్గంలో 13 వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ
- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ
- 19న పోలింగ్, అదే రోజు కౌంటింగ్, ఫలితాల ప్రకటన

ప్రత్తిపాడు: గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల అయ్యింది. దీంతో గ్రామాల్లో మినీ సంగ్రామం మొదలుకానుంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలంలో ఐదు, పెదనందిపాడు మండలంలో ఐదు, కాకుమాను మండలంలో ఒకటి, గుంటూరురూరల్ మండలంలో రెండు వార్డులకు ఈ నెల 19వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నేటి నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ప్రత్తిపాడు ఎంపీడీవో ఎ. శ్రీరమ్య తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఎన్నికలు జరగనున్న గ్రామ పంచాయతీల్లో మాత్రమే ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ఆయా పంచాయతీలకు ఎన్నికల అధికారుల నియామకం కూడా పూర్తయ్యింది. ప్రత్తిపాడు మండలంలోని మేడావారిపాలెం పంచాయతీ 2వ వార్డు(జనరల్), పాత మల్లాయపాలెం 10 వార్డు(ఎస్సీ), నడింపాలెం 10వ వార్డు(బీసీ మహిళ), నిమ్మగడ్డవారిపాలెం 4వ వార్డు(జనరల్) పెదగొట్టిపాడు 2వ వార్డు(జనరల్), పెదనందిపాడు మండలంలోని గొరిజవోలు గుంటపాలెం పంచాయతీ 8వ వార్డు (ఎస్సీ మహిళ), రావిపాడు 8వ వార్డు(బీసీ మహిళ), అబ్బినేనిగుంటపాలెం4వ వార్డు(జనరల్), వరగాని 4వ వార్డు(ఎస్సీ), వరగాని 8వ వార్డు(జనరల్), గుంటూరు రూరల్ మండలంలోని చల్లావారిపాలెం పంచాయతీ 5వ వార్డు(జనరల్), ఓబులనాయుడుపాలెం 8వ వార్డు(ఎస్సీ మహిళ), కాకుమాను మండలంలోని బీకేపాలెం పంచాయతీ 8వ వార్డు(ఎస్సీ)లకు ఎన్నికలు జరగనున్నాయి.



గొట్టిపాడు పంచాయతీ కార్యాలయం

- 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ.
- 11న నామినేషన్ల పరిశీలన.
- 12న అభ్యంతరాల స్వీకరణ.
- 13న అభ్యర్థుల అభ్యంతరాల పరిష్కారం.
- 14న నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు తుది అభ్యర్థుల జాబితా విడుదల.
- 19న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్.
- 19 న మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు, వెంటనే పలితాల ప్రకటన.

చిన్నారులకు టీకాలు వేయించాలి

పెదకాకాని: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి, ప్రాణాంకత వ్యాధులు దరిచేరకుండా కాపాడుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి అన్నారు. మిషన్ ఇంద్ర ధనుష్ 5.0 కార్యక్రమంలో బాగంగా సోమవారం పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె పాల్గొన్నారు. అనివార్య కాణాల వల్ల టీకాలు వేయించని వారికి, ఆశలు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు మొదటి విడత ఇంద్ర ధనుష్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ , సూపర్‌వైజర్ పుసులూరు శ్రీను, వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ ఆసుపత్రి ఏర్పాటు శుభ పరిణామం

ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి విడదల రజిని

గుంటూరు రూరల్: భారతీయ సంస్కృతి, సాంప్రదాయల ఆయుర్వేద వైద్యం ఎప్పటి నుంచో అమలులో ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. సోమవారం నగర శివారులోని ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద నూతనంగా వంద పడకల శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ వెంకటేశ్వర్లు అధునాత పద్ధతిలో వంద పడకల ఆయుర్వేదిక్ హాస్పిటల్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, భాష్యం రామకృష్ణ, బొల్లేపల్లి సత్యనారాయణ, బి.రామారావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ల్యాబ్‌లు, చికిత్స కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా అధునాతన పద్ధతిలో శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ (కేరళ పంచకర్మ స్పెషాలిటీ) ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కొట్టాకల్ ఆర్యవైద్యశాల కేరళ వారి అనుబంధ సంస్థ అని తెలిపారు. ఈ హాస్పిటల్ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఆయుర్వేద, కేరళ పంచకర్మ వైద్యం అందిస్తోందన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

సంక్షేమాభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. చింతలపూడి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారికి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. చింతలపూడి గ్రామంలో రూ.1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.57.49 లక్షలతో నిర్మించిన రక్షిత మంచి నీటి పథకం ఓహెచ్ఎస్ఆర్, రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనం, ఆర్‌బీకే భవనాలను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను తెలియజేస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ.. చింతలపూడి గ్రామాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్ద పీట వేసినట్లు తెలిపారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద చల్లే విధంగా దుష్ప్రచారాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు అన్నాబత్తుని సదాశివరావు, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపీపీ భవనం పద్మలీల, వైఎస్సార్‌సీపీ నాయకులు మారుపూడి వెంకట్, రావిపాటి బోస్, చిగురుపాటి సుబ్బారావు, సోమన్న దొర, మెరుగుల శ్రీనివాసరావు, బండి సాయి, పెరికల కృష్ణమోహన్, షేక్ మాము, ఇందేటి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.



చింతలపూడి గ్రామంలో వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

వీవీఐటీలో న్యాయ విజ్ఞాన సదస్సు



సివిల్ జడ్జి చంద్రమౌళేశ్వరిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి చంద్రమౌళేశ్వరి అన్నారు. నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్, గుంటూరు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సివిల్ జడ్జి చంద్రమౌళేశ్వరి మాట్లాడుతూ మహిళల సంక్షేమం, రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. ర్యాగింగ్ పేరిట వేధిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యం దిశగా పయనించి అనుకున్నది సాధించాలన్నారు. లోక్ అదాలత్ పనితీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, సీనియర్ ప్యానల్ అడ్వకేట్ కాళిదాసు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు చిత్తశుద్ధితో కృషి

నిమ్మగడ్డవారిపాలెం సొసైటీ అధ్యక్షుడిగా గురుగూరి పరమేశ్వరరెడ్డి

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందని నిమ్మగడ్డవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు గురుగూరి పరమేశ్వరరెడ్డి అన్నారు. నిమ్మగడ్డవారిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకర కార్యక్రమం సోమవారం అట్టహాసంగా జరిగింది. ప్రత్తిపాడులోని సొసైటీ కార్యాలయంలో తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అధ్యక్షుడిగా గురుగూరి పరమేశ్వరరెడ్డి, డైరెక్టర్లుగా కోయవారిపాలేనికి చెందిన కొక్కెర శ్రీనివాసరావు, పెదగొట్టిపాడుకు చెందిన పల్లపాటి సుందరరావు ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురుగూరి పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు విస్తృత సేవలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల భరోసా కేంద్రాలు, వైఎస్సార్ రైతు భరోసా, పంట బీమా పథకం..వంటి అనేక పథకాలతో రైతుల అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన స్థానిక ఎమ్మెల్యే సుచరితకు, మండల, గ్రామస్థాయి పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపడుతున్న సొసైటీ అధ్యక్షుడు గురుగూరి పరమేశ్వరరెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాసరావు, సుందరరావు

గద్దర్ మరణం పీడిత ప్రజానీకానికి తీరనిలోటు

చేబ్రోలు: విప్లవ గాయకుడు గద్దర్ మరణం పీడిత ప్రజానీకానికి తీరని లోటు అని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. పొన్నూరులో సీపీఐ కార్యాలయం వద్ద సోమవారం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. గోగినేని పరుశురామయ్య అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఆరేటి రామారావు మాట్లాడుతూ గద్దర్ తన పాటల ద్వారా ప్రజలను చైతన్య పరిచారన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌ల ద్వారా కార్యకర్తల మరణాలను ఎండగడుతూ అనేక పాటలు పాడారని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి, ఏఐటీయూసీ నాయకులు జి.ఏడుకొండలు, ధనుంజయరావు, ఎస్‌కే బాబు, పాండు రంగారావు, హుస్సేన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం, గుంటూరు రూరల్ మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ కె ఈశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన తనిఖీలలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పనితీరు, పౌష్టికాహారం సరఫరా, రికార్డులను తనిఖీ చేశారు. మరుగుదొడ్ల సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అవసరమైన అదనపు సౌకర్యాలను స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంట, గుంటూరు రూరల్ మండలంలోని వెంగళాయపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, తహసీల్దారు కె.నాగమల్లేశ్వరరావు, ఏఈఈ వై.శివన్నారాయణ, ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ సైదులు, ఎస్ఐ రామచంద్రయ్య పాల్గొన్నారు.



పుల్లడిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రభుత్వాలు బీసీ కులగణన చేపట్టాలి

గుంటూరు రూరల్: బీసీలకు రిజర్వేషన్లు సాధించిన పితామహుడు, రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించిన రోజును బీపీ మండల్ డేగా జరుపుకుంటున్నామని బీపీ మండల్ కో–కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తక్షణమే ప్రభుత్వాలు బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాలలో 52 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. బీసీ నాయకుడు డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించినపుడే అభివృద్ధి చెందుతామని కానీ, ఆ విధంగా పాలకులు దృష్టి సారించటం లేదన్నారు. బీసీ నాయకులు రమణయ్య, టి.కేశవ, దాసరి శివకుమార్, తోట శివకుమార్, ప్రసాద్, సత్యనారాయణ, ఎం.సుబ్బారావు, కె.నరసింహారావు,పేరయ్య, పి.బాలయ్య, వైఎంఆర్‌ఏ అధ్యక్షుడు స్వామి, పాల్గొన్నారు.



బీపీ మండల్ విగ్రహానికి నివాళులర్పించిన బీసీ సంఘాల నాయకులు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం పెదపలకలూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు వివరాల మేరకు గ్రామానికి చెందిన మొఖరాల మధు(35) స్థానికంగా కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి పూటుగా మద్యం సేవించి, గ్రామ శివారులో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం రైల్వే గ్యాగ్‌మెన్‌ల సమాచారం మేరకు రేల్వే పోలీసులు ఘటన స్థలికి చేరుకుని సమీపంలో పడివున్న సెల్‌ఫోన్, చెప్పులు ఆధారంగా మధును గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

పెదకాకాని: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఈమని పద్మ అన్నారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర ప్రచార జాతకు సోమవారం పెదకాకానిలో మహిళలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానికి మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ, అధ్యక్షురాలు ఈమని పద్మ అధ్యక్షత వహించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, సభ్యులు శ్రీనివాస్ కుమారి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను అధ్యయనం చేయటానికి నిపుణులతో కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళలకు చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని, నిందితులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠినమైన శిక్షలు విధించాలనికోరారు. మహిళా సంఘం కార్యదర్శి జెట్టి రాజ్యలక్ష్మి, షేక్ హసీనా, పూర్ణకంటి నాగమణి పాల్గొన్నారు.

'చలపతి' కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

గుంటూరు రూరల్: చలపతి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.నాగభూషణానికి ఆంధ్రా యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రధానం చేసిందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. తెలిపారు. డాక్టర్ రామకృష్ణమూర్తి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్‌ను ఏయూ వీసీ నాగేశ్వరరావు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో అధ్యాపకుడిని కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరీ వై.సుజిత్‌కుమార్ తదితరులు అభినందించారు.



డాక్టరేట్ అందజేస్తున్న ఏయూ వీసీ నాగేశ్వరరావు

వీవీఐటీలో 'ప్రేమ్‌కుమార్' చిత్ర బృందం సందడి

పెదకాకాని: పేపర్‌బాయ్, ఏక్ మినీ కథ ఫేమ్ సంతోష్ శోభన్ హీరోగా రాశీసింగ్, రుచితా సాధినేని హీరోయిన్‌లుగా సారంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో అభిషేక్ మహర్షి దర్శకత్వంలో రూపొందుతున్న కామెడి ఎంటర్‌టైనర్ ప్రేమ్‌కుమార్ చిత్ర బృందం నంబూరు వీవీఐటీని సోమవారం సందర్శించింది. ఈ చిత్రం ఆగష్టు 18న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో భాగంగా కళాశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ హాస్య ప్రధానంగా ఈ చిత్రం రూపొందించబడిందని తెలిపారు. అందిరికీ నచ్చే విధంగా ఉంటే ఆదరించి మంచి విజయాన్ని అందించాలని కోరారు. డైరెక్టర్ అభిషేక్ మాట్లాడుతూ ఈ చిత్రం అందరినీ అలరిస్తుందని ఇప్పటికే విడుదలైన సంగీతం, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ సదర్భంగా చిత్ర బృందంతో కలసి విద్యార్థులు, నృత్యాలు, గీతాలు, సెల్ఫీలతో సందడి చేశారు. నటుడు క్రిష్ణ చైతన్య, వీవీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



కళాశాలలో సందడి చేస్తున్న ప్రేమ్‌కుమార్ చిత్ర బృందం

అగ్రస్థానానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

- మాజీ క్రికెటర్ అంబటి రాయుడు
- యనమదల జెడ్పీ ఉన్నత పాఠశాల సందర్శన
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం

యనమదల (ప్రత్తిపాడు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు భవిష్యత్తులో అగ్రస్థానానికి చేరుకుంటారన్న పూర్తి విశ్వాసం తనకు ఉందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. యనమదల గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత స్థానికంగా ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం స్థానికులతో కలిసి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మిర్చి తొడిమలు తీసే మహిళా కూలీలతో ముచ్చటించారు. వారి స్థితిగతులు, జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రోజు ఎన్ని గంటలు పని చేస్తారు, ఎంత కూలి వస్తుంది, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. వంటి విషయాలపై ఆరా తీశారు. తదనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులతో పాటు డిజిటల్ తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు మైదానానికి మెరక, క్రీడా పరికరాలు, సైకిల్ స్టాండు.. వంటి సమస్యలు పాఠశాలలో ఉన్నాయన్న విషయాన్ని అంబటి రాయుడుకి వివరించారు. అంతేకాకుండా ఈ ఏడాది తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అంబటి రాయుడు మాట్లాడుతూ పాఠశాలకు తన వంతుగా సాయమందిచి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. అదేవిధంగా క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ఆయ న వెంట నాయకులు వేలూరి లక్ష్మారెడ్డి, గ్రామస్తులు షేక్ సు భాని, సంతోషమ్మ, రాంబాబు, సుభాని తదితరులున్నారు.



యనమదల జెడ్పీ హైస్కూల్‌లో ద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అంబటి రాయుడు

ప్రాంగణ ఎంపికల్లో జీవీఆర్‌ఎస్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పించటం లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తోందని జీవీఆర్‌ఎస్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కరిమున్నీసా అన్నారు. సోమవారం బుడంపాడు గ్రామంలోని కళాశాలలో టాగ్ టెక్నాలజీస్, డైకిన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరిని కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.సిందూర, డాక్టర్ చైతన్య, కళాశాల డీన్ డాక్టర్ బి.వరప్రసాద్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌బాబు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కుశల్‌కుమార్, ప్రశాంత్ హెచ్ఆర్ శివకోటయ్య ఆచారి అభినందించారు.

